రజతోత్సవ సభకు అన్ని వర్గాలు తరలి రావాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 : ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2001లో కేసీఆర్ ఒక్కడిగా బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్రం కోసం లక్షల సైన్యాన్ని తయారు చేశారన్నారు.14 ఏండ్లు పోరాడి ఢిల్లీ పెద్దల మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ప్రజల అభీష్టం మేరకు పదేండ్లు రాష్ట్రాన్ని పాలించి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి, మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షం, నాయకులు పాడిచేటి రవికుమార్, మామిండ్ల సైదులు, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

శాలిగౌరారం : వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌కేవీ మండలాధ్యక్షుడు మామిడి రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బాకి వెంకటయ్య, రాచకొండ గణేశ్, కొడిమాల శంకరయ్య పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తితో ఓరుగల్లుకు కదులుదాం..

- ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉన్నది గులాబీ జెండానే
- నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 27న ఓరుగల్లులో జరిగే బహిరంగ సభకు ఉద్యమస్ఫూర్తితో దండులా కదిలిరావాలని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పిలుపునిచ్చారు. హాలియాలో మంగళవారం జరిగిన అనుముల మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ 2023లో జరిగిన ఎన్నికల్లో పోయింది అధికారం మాత్రమేనని, కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజల హృదయాల్లో ఉన్నది గులాబీ జెండనే అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు మాయమాటలతో ప్రజలను మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి ప్రజలు ఇప్పుడు ఇబ్బంది పడాల్సి వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బంపర్ మెజార్టీతో అధికారంలోనికి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓరుగల్లు సభతో కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కురాకుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు గుండెబోయిన వెంకన్న, రాములు, ధర్మారెడ్డి, యడవల్లి నాగరాజు, బిల్లకంటి శ్రీను, మాజీ ఎంపీటీసీ వెంటయ్య, సైదులు, మండల యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజు గౌడ్, పేరూరు దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ రాయనబోయిన రామలింగయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్లు సురబి రాంబాబు, ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు వీర్రాజు, గురజాల సైదులు, శ్రీను, ఎల్లయ్య పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్‌గౌడ్ క్షమాపణ చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

మాట్లాడుతున్న తిప్పన విజయసింహారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 22: ఆంధ్రాలోని ప్రకాశం, కృష్ణ, గుంటూరు జిల్లా వాళ్లు తెలంగాణాకు వచ్చి ఇక్కడి వారికి సాగు నేర్పించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని అవమాన పర్చేలా ఉన్నాయని, ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలంగాణ రైతులను అవమానిస్తూనే ఉందన్నారు. రైతు మహోత్సవం అంటూనే తెలంగాణ రైతులను హేళన చేసే విధంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఆయన వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. వెయ్యేండ్ల క్రితమే వరి పండించిన చరిత్ర తెలంగాణాదే అని, ప్రపంచానికి వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్‌ను నేర్పి, అతి పెద్ద భారీ నీటిపారుదల ప్రాజెక్టును కట్టిన ఘనత తెలంగాణాదే అన్నారు. అలాంటి ఘన చరిత్రకు మసిపూసేలా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారన్నారు. తెలంగాణ రైతాంగాన్ని అవమానించేలా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ధనావత్ చిట్టిబాబునాయక్, చౌగాని భిక్షంగౌడ్ ఉన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేద్దాం : నాగార్జున

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున

రామగిరి, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలి వెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం ఎంజీయూలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల పరిపాలనలో అన్ని రంగాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. సమావేశంలో నాయకులు రవి, మైనం యుగేందర్, మహేశ్, మాచర్ల సుధీర్, జాన్‌ప్రేమ్, విజయ్‌కుమార్, ఏడుకొండల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంజీయూలో కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమ్మె

ఎంజీయూలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

రామగిరి, ఏప్రిల్ 22: కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంజీయూలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న అధ్యాపకులకు బీఆర్ఎస్‌వీ, పీడీఎస్‌యూ నాయకులు వాడపల్లి నవీన్, రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు మద్దతు తెలిపారు.

పార్ట్‌టైం అధ్యాపకులు

ఎంజీయూలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు మంగళవారం సమ్మె చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పలు కుటుంబాలను పరామర్శించిన భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 22: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోల పుల్లారెడ్డి(67), మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కట్టా పిచ్చిరెడ్డి(88) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు వారి ఇండ్లకు వెళ్లి మృత దేహాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ బాలాజీనాయక్, పాదూరి సంజీవరెడ్డి, దుండిగల శ్రీనివాస్, ఎర్రయ్య, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరెడ్డి ఉన్నారు.

జిల్లా జైలును సందర్శించిన డీఐజీ

- జైలు నిర్వహణపై ఆగ్రహం.. ఇద్దరు అధికారుల బదిలీ

నీలగిరి, ఏప్రిల్ 22 : తెలంగాణ జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డి.శ్రీనివాస్ మంగళవారం జిల్లా జైలును సందర్శించారు. జైళ్ల శాఖకు సంబంధించిన పాత ఇనుప సామగ్రితోపాటు పాత కంప్యూటర్లు ఇతర వస్తువుల వేలానికి సంబంధించిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన జైలును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న మెనూ, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, పరిశుభ్రత, ఖైదీల పరివర్తనపై సిబ్బందితో చర్చించారు. జైలు అధికారులు ఖైదీల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణలో పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా ఇందుకు బాధ్యులైన ఇద్దరు అధికారులను(సబ్ జైలర్స్) అప్పటికప్పుడు బదిలీ చేశారు. వారు 24 గంటల్లో రిలీవ్ కావడంతోపాటు ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. దాంతో పాటు మరి కొంతమంది సిబ్బందికి మెమోలు జారీ చేయాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్లు నరేశ్, బాలకృష్ణ ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడి భూసారాన్ని పెంచుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మాల్, ఏప్రిల్ 22: రైతులు సేంద్రియ ఎరువులు వాడి భూసారాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ సూచించారు. మంగళవారం చింతపల్లి మండలం వింజమూర్ గ్రామ రైతు వేదికలో మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంగోష్టి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులను వాడడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతుందని, రెండు, మూడు తరాల్లో భూమి వ్యవసాయానికి పనికిరాకుండా పోతుందని పేర్కొన్నారు. భూసారాన్ని పరిరక్షించుకునేందుకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులు వేసి పండించిన ధాన్యం తినడం వల్ల మనుషులు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీలక్ష్మి, ఏఓ శ్రవణకుమారి, మద్రాస్ ఫర్టిలైజర్ మిర్యాలగూడ మేనేజర్ రామారావు, పూల యాదయ్య, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

రాచకాల్వలో రైతుల శ్రమదానం

కాల్వలో చెత్తను తొలగిస్తున్న రైతులు

శాలిగౌరారం, ఏప్రిల్ 22 : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే మార్గంలోని తుర్కపల్లి హెడ్‌వర్క్ వద్ద రాచకాల్వను ఆయకట్టు రైతులు మంగళవారం శ్రమదానం ద్వారా శుభ్రం చేశారు. కాల్వలో చెత్త, గుర్రపుడెక్క ఆకు నీటి ప్రవాహానికి అడ్డు పడుతుండడంతో రైతు సంఘం మండల ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు కాల్వలో దిగి వాటిని తొలగించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల రమేశ్, మాజీ సర్పంచ్ బండారు శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎంజీయూ కామర్స్ డీన్‌గా ఆకుల రవి

రామగిరి, ఏప్రిల్ 22: మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ డీన్‌గా అదే విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆకుల రవిని నియమిస్తూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాలమేరకు మంగళవారం రిజిస్ట్రార్ అల్వాల రవి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు డీన్‌గా పనిచేసిన తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ యాదగిరి నుంచి ఆకుల రవి బాధ్యతలు స్వీకరించారు. ఆకుల రవిని వివిధ విభాగాల అధికారులు, సహచర అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో 'ప్రగతి' ప్రభంజనం

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

రామగిరి, ఏప్రిల్ 22: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు నిర్వాహకులు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి.మీనాక్షి 995, నజ్రా జబీన్, జె.మధులత, ఎమ్. మనీష, ఎం.అజయ్‌కుమార్ 993, పి.సింధు, హాసి ని, ప్రసన్న, బి.భవాని, కె.జహ్నవి, బి. కల్యాణి 992 మార్కులు, బైపీసీలో కె. ఉజ్వల 994, బి.భువనేశ్వరి 991 మార్కు లు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జి.అనూశ్రీ 468, కె.స్వాతిక్, ఎండీ ఆతిఫ్, కె.అక్షర, జి.వెన్నెల, తేజశ్విని, స్నేహరెడ్డి 467, బైపీసీలో ఎం.ఉషాశ్రీ , ఎ.సాయి అక్షర, ఎండీ ఐషాబుతుల్ 435 మార్కులు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేశ్‌రెడ్డి అభినందించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

- ఎంజీయూ వీసీ, రిజిస్ట్రార్

ఎంజీయూలో మొక్కలు నాటుతున్న వీసీ, రిజిస్ట్రార్

రామగిరి, ఏప్రిల్ 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి అన్నారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా మంగళవారం వర్సిటీ సైన్స్ కళాశాలలో వారు మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లమలలో త్వరలో జంతుగణన

- అటవీ ప్రాంతంలో 65 ట్రాప్ కెమెరాలు

చందంపేట, ఏప్రిల్ 22 : నల్లమల అటవీ ప్రాంతంలో జంతువులను లెక్కించేందుకు సుమారు 65 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ భాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కంబాలపల్లి రేంజ్ పరిధిలోని కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులవలయం, చిత్రియాల, ఎర్రపేడ, పాలపేడ అటవీ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాప్ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షించారు. ట్రాప్ కెమెరాలు, పాద ముద్రల ఆధారంగా జంతువులను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. వేసవి కావడంతో అటవీ జంతువులు తాగు నీటి కోసం అడవులు దాటి జన సంచారంలోకి రాకుండా నీటి తొట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నల్లమల అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడం నేరమన్నారు. అటవీ కలపను తరలిస్తే, జంతువులను వేటాడితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

యూపీఎస్సీ ఫలితాల్లో వీర్లగడ్డ తండావాసికి 920వ ర్యాంకు

దేపావత్ మౌనిక

హాలియా, ఏప్రిల్ 22 : యూపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో అనుముల మండలం వీర్లగడ్డ తండాకు చెందిన దేపావత్ మౌనిక 920వ ర్యాంకు సాధించింది. దేపావత్ మౌనిక తండ్రి దివంగత లచ్చిరాంనాయక్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉండేవాడు. మౌనిక ఇంటర్ హైదరాబాద్‌లో చదువుకోగా బీటెక్ ఐఐటీ చెన్నైలో పూర్తి చేసింది. 2023లో స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షలో ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. అకౌంట్స్ జనరల్ ఆఫీస్ హైదరాబాద్‌లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తూనే ఆలిండియా సివిల్ సర్వీస్ పరీక్షకు ప్రిపరేషన్ కొనసాగిస్తూ 920 ర్యాంక్ సాధించింది. మౌనిక సివిల్ సర్వీస్‌కు ఎంపిక కావడం పట్ల గ్రామ మాజీ సర్పంచ్ బాలునాయక్, నాగేందర్‌నాయక్, బీమా నాయక్, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో 'గౌతమి' ఘన విజయం

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వెంకటరమణారెడ్డి

రామగిరి, ఏప్రిల్ 22: ఇంటర్ ఫలితాల్లో నల్లగొండలోని గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో వై.తితీక్ష , హిబా మైరుక్ 994, మలిహా తస్నీమ్, సోబియాఖానమ్, బి.కార్తీక్ 991, మదీహా ఫిర్దోజ్, ఎస్.భవ్యశ్రీ, సీహెచ్ స్వప్న 990, ఎంపీసీలో ఆర్.సింధు, జె.వైష్ణవి, జి.తేజస్విని 993, సీహెచ్ యమున, ఎ.ఉమా, ఎమ్.శ్రీను 991 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సి.శ్రీచరణ్ 468, ఎన్.నిస్సిసంయుక్త, పి.గణేశ్ 467, జె.మీరాడురేన్, డి.స్పందన, ఎం.నందిని, ఎస్.అఖిల 466, బైపీసీలో కె.దీక్షిత 437, సలామ్‌ఐమన్ 436, ఎస్.నిఖిత, ఎమ్. అనుజ్ఞ, జుబియా హిర్మాన్, ఎన్.సతీశ్ 434 మార్కులు సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించి స్వీట్లు తినిపించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : డీఆర్‌డీఓ

గుర్రంపోడ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీఓ

గుర్రంపోడ్, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని చామలోనిబావి, కొయిగూరోనిబావి, వట్టికోడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి,సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఏపీఎం యాదయ్యకు సూచించారు. ఆయన వెంట సీసీలు శేఖరయ్య, రాజేశ్వరి, సెంటర్ ఇన్‌చార్జీలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బడిబాట

కట్టంగూర్, ఏప్రిల్ 22 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం మండలంలోని దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మిట్టపల్లి మురళయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి జడ్పీహైస్కూల్ ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రమావత్ రవినాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ యశోదాబాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27 న 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

నిడమనూరు, ఏప్రిల్ 22 : ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 21 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో శ్రీవేదాంత కళాశాల విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల నిర్వాహకులు

రామగిరి, ఏప్రిల్ 22: ఇంటర్ ఫలితాల్లో నల్లగొండలోని శ్రీవేదాంత్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి సత్తాచాటినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ద్వితీ య సంవత్సరం ఎంపీసీలో ఎన్.శిరీష 993, జె.అంకిత 991, బైపీసీలో జి.లక్ష్మీప్రసన్న 986 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎం.దివ్యశ్రీ 465, మీనాక్షి 457, బైపీసీలో జి.సిరి చందన 429, టి.వైష్ణవి 422 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసారావు, అధ్యాపకులు రఘు, సైదులు, రాంబాబు, విజయ్, అనిల్ అభినందించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 22 : విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించేందుకు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్,ఆర్టీసీ కాలనీ, బీజేపీ ఆఫీస్ ఏరియా, పానగల్ ఫ్లైఓవర్ ఏరియా, బోయవాడ, ఎస్పీఆర్ స్కూల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

హాలియాలో..

హాలియా, ఏప్రిల్ 22 : స్థానిక 33 కేవీ లైన్‌ను ఆనుకొని ఉన్న చెట్లను తొలగించేందుకు బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాలియా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ధనుంజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ : పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి వచ్చే11కేవీ ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నందున బుధవారం డాక్టర్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో వన్‌టౌన్ ఏఈ పి.మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్లయింట్ అయిన శ్రీ షేక్ మగ్బుల్ పాషా, తండ్రి. మహబూబ్ అలీ, వయస్సు : 30 సం||లు, వృత్తి : వ్యవసాయం, నివాసం : ఇ.నెం. 1515-150/508, లక్ష్మీపురం కాలనీ, కోదాడ టౌన్ & మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ వారి సూచనలు మేరకు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా

నా యొక్క క్లయింట్‌కు కోదాడ టౌన్ మరియు మండలం & సూర్యాపేట జిల్లా. కోదాడ మున్సిపల్ పరిధిలో గల బ్లాక్ నెం. 14 గల సర్వే నెం.591/ఆ1, 592/అ 1-1 లో ప్లాట్ నెం.5లో ఖాళీ స్థలం గల దాని విస్తీర్ణము : 222.22 చ||గ|| లు ఆయన పేరుతో కోదాడ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నందు రిజిస్ట్రీ కాబడిన విక్రయ దస్తావేజు నెం.6622/2021 ద్వారా ఆయనకు సంక్రమించియున్నది. నా యొక్క క్లయింట్ తన పనుల నిమిత్తము తేది :08.04.2025న సుమారు ఉదయం 10 గం||ల సమయంలో నల్లొండకు వెళ్ళినారు. అక్కడ నాగార్జున కాలనీ ఏరియాలో ఆటోలో ప్రయాణించు సమయంలో పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించిన (ఒరిజినల్ దస్తావేజులు) విక్రయ దస్తావేజు లు నెం. 6622/2021 పోగొట్టుకొనియున్నారు. అట్టి దస్తావేజులు నా యొక్క క్లయింట్ అయిన శ్రీ షేక్ మగ్బుల్ పాషా గారు ఏదేని బ్యాంకులకు గాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకుగాని, ఏ విధమైన తాకట్టుగాని, కుదవగాని చేయడంలేదు.

ఇట్టి దస్తావేజు ద్వారా ఏవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షంలో ఈ క్రింద తెలిపిన చిరునామాకు సంబంధిత ఆధార ప్రతులతో వారి యొక్క హక్కులు ఆ ప్రకటన వెలుబడిన తేది నుండి (7) రోజులలో తెలుపుకొనగలరు. దారిమాల వచ్చిన ఆక్షేపణలు నాయొక్క క్లయింట్‌ను ఏ విధంగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా.

సం. షేక్ కలీముల్లా, అడ్వకేట్
సాయి అపార్ట్‌మెంట్ ఎదురుగా, భవాని నగర్
కోదాడ, సూర్యాపేట జల్లా, సెల్ : 97078603

ప్రకటన

నా క్లయింట్ అయి అన్నేపూరి ఇందిరమ్మ భర్త నగేష్ వయసు 42 సం., వృత్తి గృహిణి, నివాసం ఇంటి నం.4-54, రామ్‌నగర్, మిర్యాలగూడ రోడ్డు, నల్లగొండ టౌన్ & జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా విక్రయ దస్తావేజు నం.11316/2007, SRO- Nalgonda ద్వారా కొనుగోలు చేసినాను. దాని యొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నెం.762/1990, SRO- Nalgonda మా ఇంటి నుండి రామగిరికి వెలుచుండగా మార్గ మధ్యలో పోయినవి కావున ఇట్టి విషయము నల్లగొండ II టౌన్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్తి యొక్క వివరములు ప్లాట్ నం.138, సర్వే నం.238, విస్తీర్ణం 300.00 చదరపు గజాలు 250.84 చదరపు మీటర్లు న్యూలి డెవలప్డ్ ఏరియా, గొల్లగూడ రెవెన్యూ గ్రామం, నల్లగొండ మండలం & జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు: ఉత్తరం:25.00 వైడ్ ప్రపోస్డ్ రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.143, తూర్పు: ప్లాట్ నం.137, పడమర: ప్లాట్ నం.139, ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంత్రమునదో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393
నల్లగొండ
తేది:22-04-2025

పేదలకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందించాలి : సీపీఐ

మునుగోడు,ఏప్రిల్22 : ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అందేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుజ రామచంద్రం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల మౌలిక వసతులు కల్పన కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బి.లాలు, గోస్కొండ లింగయ్య, పాండు, రమేశ్, ఈదుల కంటి కైలాశ్, ఎండీ జానీ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెద్దవూర, ఏప్రిల్ 22: మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ మంగ్తానాయక్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ధనావత్ దత్తు 863 మార్కులు, బైపీసీలో ఆర్.విష్ణువర్ధన్ 949 మార్కులు సాధించినట్లు పేర్కొన్నా రు. ఎంపీసీలో వందశాతం, బైపీసీలో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

- మిర్యాలగూడ రూరల్ : మిర్యాలగూడ మండలం తుంగపహాడ్‌లో నిర్వహిస్తున్న తుమ్మడం బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. సెకండ్ ఇయర్ బైపీసీలో జె.అఖిల 992 మార్కులు, దామరచర్ల బీసీ బాలికల గురుకులంలో ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో కె.రేవతి, బి.హన్సిక 986 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. తుమ్మడం గురుకుల కళాశాలలో ఫస్టియర్‌లో 81.5 శాతం, సెకండ్ ఇయర్‌లో 78.2 శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.
- దామరచర్ల : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ఎంపీసీ విద్యార్థిని స్పందన 983 మార్కులు, బైపీసీ విద్యార్థిని బి.నవ్య977 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వరూప తెలిపారు. కస్తూర్బాలో ఇంటర్ సెకండియర్‌లో 100 శాతం, మోడల్ స్కూల్లో సెకండియర్‌లో 53.8 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్స్ తెలిపారు.
- గుర్రంపోడ్ : ఇంటర్ ఫలితాల్లో స్థానిఎక మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 113 మందికి 90 మంది, ద్వితీయ సంవత్సరంలో 113 మందికి 106 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.రాగిణి తెలిపారు. పిట్టలగూడెంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 37 మందికి 36 మంది, రెండో సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ తెలిపారు.
- త్రిపురారం : మండలంలోని కంపసాగర్ ఆదర్శ కళాశా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీసీ సెకండియర్‌లో పోలిబోయిన గాయత్రి 955 మార్కులు, సీఈసీలో పడిశాల వేణుగోపాల్ 970, బైపీసీలో ధనావత్ వనిత 952 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో శ్రావణి 422 మార్కులు పొందినట్లు తెలిపారు.
- నిడమనూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.భావన 455, ఎ.వర్షిత 428, బైపీసీలో జి.వెన్నెల346, సీఈసీలో కె. కావ్య405, ఎంఈసీలో పి.పల్లవి 444 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో కె.యాగ్నేశ్ 985, జె.ప్రమోద్ 981, బైపీసీలో ఎ.జ్యోతి 940 మార్కులు పొందినట్లు పేర్కొన్నారు.
- కొండమల్లేపల్లి : పట్టణంలోని బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 87 శాతం, ప్రథమ సంవత్సరంలో 72 శాతం, ఎస్సీ గురుకులంలో ద్వితీయ సంవత్సరంలో 100 శాతం, ప్రథమ సంవత్సరంలో 89 శాతం, ఎస్టీ గురుకుల కళాశాలలో సెకండియర్‌లో 89 శాతం ఫస్టియర్‌లో 79 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణులైనట్లు కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లీశ్వరి, శౌరీ, శారద తెలిపారు.
- మర్రిగూడ : మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన జంపాల తేజశ్రీ ఎంపీసీ సెకండియర్‌లో 973, మాదగోని శ్రావ్య 950మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో మాదగోని కావ్య 457, కల్లెట్ల పునీత 432 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శివస్వరూప రాణి తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

వ్యవసాయ మోటారు వైర్లు దొంగిలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

తిప్పర్తి, ఏప్రిల్ 22: వ్యవసాయ బోరు బావుల నుంచి సర్వీస్ వైర్లను ఎత్తుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం తిప్పర్తి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై సాయి ప్రశాంత్ వివరాలు వెల్లడించారు. కొద్ది రోజులుగా మండలంలో పగటిపూట మోటర్‌వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారు. ఈ నెల 20న పెద్ద సూరారం గ్రామానికి చెందిన కోట్ల జలేందర్ రెడ్డి రైతు బోరుబావి నుంచి సుమారు 160 మీటర్ల సర్వీస్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని సదరు రైతు ఫిర్యాదు చేశాడు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. నల్లగొండ మండలం రాంనగర్‌కు చెందిన అన్నపూరి రవి, సూర్యాపేట జిల్లా చందుపట్లకు చెందిన శిగ ఉపేందర్ వైర్లను దొంగిలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వీరు ఎత్తుకెళ్లిన వైరును నల్లగొండ పట్టణానికి చెందిన వల్లపుదాసు ఎల్లయ్య దుకాణంలో విక్రయిస్తున్నారు. వీరి వద్ద నుంచి రూ.53.800 విలువైన వైర్లు, మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణను విరమించుకోవాలి : ఐద్వా



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రామగిరి, ఏప్రిల్ 22: హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఐద్వా, పీఓడబ్ల్యూ, డీవైఎఫ్ఐ, పీవైఎల్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక సుభాశ్ విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు పోలబోయిన వరలక్ష్మి, కొండ అనూరాధ, తుమ్మల పద్మ, ఉమారాణి, అంబేద్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.